క్లుప్తంగా

సంధ్యకు సన్మానం



ఎస్ఎస్‌తాడ్వాయి : తెలంగాణ సారస్వతా పరిషత్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఆదివారం జరిగిన పుస్తక ఆవిష్కరణ సభలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపన్యాసకులు కొమ్మాల సంధ్యను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకంలో వ్యాసం రాసినందుకు ఆమెను సన్మానించారు. సన్మానం పొందిన సంధ్యను కళాశాల అధ్యాపకుల బృందం అభినందనలు తెలిపింది.

ఘనంగా గ్రామదేవతల పండుగ



వాజేడు: మండల పరిధిలోని నాగారంలో ఆదివారం ఎల్లనంపుడు (గ్రామదేవతల) పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు పడగానే వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగను నిర్వహిస్తారు. అదే విధంగా గ్రామంలోనికి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగను నిర్వహించారు. గ్రామ దేవతల గుడి వద్ద నుంచి చెక్కలతో తయారు చేసిన చిన్నబండిని పూజల అనంతరం తీసుకు వెళ్లి గ్రామం చివరలో ఉంచారు. గుడివద్ద మొక్కులు సమర్పించారు.

'దశదిన కర్మ'లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్



వాజేడు : నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య అత్తగారైన తల్లడి సమ్మక్క దశదినకర్మ కార్యక్రమంలో ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ బడే నాగజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మక్క చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు గడదాసు సునీల్ కుమార్, ఏటూరునగారం ఎంపీపీ అంతటి విజయ, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, వలీబియా, రాములు, మల్లా రెడ్డి, మహేష్ గౌడ్, ఖాజాపాషా, వాజేడు, వెంకటాపురం(కె) జెడ్పీటీసీలు పుష్పలత, రమణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ.షాఖాన్ తెలిపారు. మండలంలోని అందుకుతండాకు చెందిన అట్కార్ రాజేష్ మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా తండా గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. దీంతో ఇసుక ట్రాక్టర్‌తో పాటు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఎండీ గౌస్, లాల్‌సింగ్, అస్లాం జానీ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్షుడు వేణు


రవీందర్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆవరణలో సాయి గణపతి బ్రిక్స్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరునగరి వేణు, ప్రధాన కార్యదర్శిగా చిదురాల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రామిడి కృష్ణారెడ్డి, బోయిని వినోద్‌కుమార్, కురిమిళ్ల కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా ఆలూరి సుధాకర్, చిదిరాల ఆనంద్, ప్రచార కార్యదర్శిగా బండ్ల రఘు, కోశాధికారిగా బొమ్మినేని రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షునిగా కర్ర సత్తిరెడ్డితో పాటు సభ్యులు రవీందర్, బుచ్చిరెడ్డి, రాజు నాయక్, అల్లీమియా, చిరంజీవి ఎన్నికయ్యారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల(రేగొండ): తెలంగాణ కార్మిక శాఖ, సీఎస్‌సీ ఆధ్వర్యంలో సోమవారం రేగొండలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని లేబర్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లేబర్ కార్యాలయ జిల్లా కో ఆర్డినేటర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు కొనసాగే వైద్య శిబిరానికి ఆధార్, లేబర్ కార్డును తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అనుమతులు వచ్చేనా?

- రహదారి పనులు పూర్తయ్యేదెప్పుడు
- అడ్డుగా మారిన అటవీ హక్కుల చట్టం
- అనుమతుల కోసం సిఫారసు

వాజేడు : అటవీ హక్కుల అనుమతులు రహదారి విస్తరణ పనులకు అడ్డంకిగా మారాయి. మండల పరిధిలోని పేరూరు నుంచి చెరుకూరు వరకు సుమారు 6 కిలోమీటర్ల రహదారి విస్తరణకు మూడేళ్ల క్రితం నిధులు మంజురయ్యాయి. ఈ నిధులతో రహదారి విస్తరణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ వేగంగా పనులను పూర్తి చేశాడు కానీ తలనొప్పి ఇక్కడే మొదలైంది. పేరూరు నుంచి చెరుకూరు వరకు రహదారి నిర్మాణ పనులను చేస్తుండగా మండల పరిధిలోని ధర్మవరం నుంచి చెరుకూరు వరకు మధ్యన ఉన్న రహదారి సుమారుగా రెండు కిలోమీటర్లు రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉంది. ఇక్కడ పనులను పూర్తి చేయాలంటే తప్పనిసరిగా అటవీశాఖ నుంచి అనుమతులు రావాలి. అది కూడా కేంద్రం నుంచి కావడంతో పనులు నిలిచిపోయాయి. 6 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కేవలం 4 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించి మరో రెండు కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులకు అటవీ హక్కుల అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు. పనులు ప్రారంభమై రెండేళ్లు అవుతున్నప్పటికీ ఇంత వరకు అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు.

గుమ్మడిదొడ్డి, ఏడ్జర్లపల్లి మధ్య పనులు

మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి నుంచి ఏడ్జర్లపల్లి వరకు 12 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులకు ఈ ఏడాది నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే పనులను ప్రారంభించారు. కానీ మండల కేంద్రం నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వరకు సుమారుగా 300 మీటర్ల మేర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇక్కడ కూడా రహదారి రిజర్వ్‌ఫారెస్టులో ఉండటంతో కాంట్రాక్టర్ రహదారి విస్తరణ పనులను ఆపేశారు. రిజర్వ్ ఫారెస్టు లేని చోట రహదారి విస్తరణతో పాటు కల్వర్టులు, బ్రిడ్జిల పనులను చేస్తున్నారు. కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతులు వస్తేనే ఇక్కడ పనులు జరిగే అవకాశం ఉంది.


వాజేడు వద్ద నిలిచిన రహదారి విస్తరణ పనులు

అనుమతుల కోసం సిఫారసు

రహదారి విస్తరణ పనుల్లో రిజర్వ్‌ఫారెస్ట్ ఉన్న చోట పనులు నిలిచిపోయాయి. ఇక్కడ పనులు జరపాలంటే తప్పనిసరిగా అటవీ హక్కుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. ధర్మవరం నుంచి చెరుకూరు వరకు, వాజేడు నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వరకు ఉన్న రహదారి పనులను చేపట్టడానికి అనుమతులు పక్కాగా కావాల్సి ఉంది. అనుమతులు పొందడం కోసం అధికారుల ద్వారా సిఫారసు లేఖలను పంపించారు. అనుమతులు వస్తేనే నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు జరిగే అవకాశం ఉంది.


చెరుకూరు నుంచి ధర్మవరం వెళ్లే రహదారి

ఆర్థికసాయం అందజేత


ములుగు రూరల్: ఆర్థికసాయం అందిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య, మిత్రులు


కన్నాయిగూడెం: బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ కావిరి పద్మ

ములుగు రూరల్: ములుగు మండలం సర్వాపురం గ్రామానికి చెందిన ఈక లక్ష్మయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా అంబేడ్కర్ గ్రూప్ ఆధ్వర్యంలో మిత్రులు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య రూ.24వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో గుండెబోయిన రవిగౌడ్, శ్రీహరిగౌడ్, బాగెరాజు, ఈక కుమార్, శోభన్, నారాయణ, రేణుక, విజయ తదితరులు పాల్గొన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ కుటుంబాన్ని పరామర్శించారు.

కన్నాయిగూడెం : మండల పరిధిలోని బుట్టాయిగూడెంకు చెందిన సునార్కని మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని సర్పంచ్ కావిరి పద్మ కార్యకర్తలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు బియ్యం, వంట సరుకులను అందించారు. అనంతరం సర్పంచ్ పద్మ మాట్లాడుతూ మల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో వెంకటయ్య, పెద్దోల పోషయ్య, మండల సీనియర్ నాయకులు జనగాం సమ్మయ్య, కావిరి సమ్మయ్య, కుమ్మరి నర్సింహారావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల: మండలంలోని ముచినిపర్తికి చెందిన దామెర కొమురయ్య, తిరుమలాపూర్ గ్రామానికి చెందిన చేరాల బిట్టు, చల్లగరిగకు చెందిన రావుల రాజమల్లు , జడల్‌పేట గ్రామానికి చెందిన తనుకు వినయ్‌లు వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆదివారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్, జడలపేట ఉపసర్పంచ్ బండారి శ్రీనివాస్, నాయకులు దామెర రాజు, ప్రశాంత్, సురేష్, చేరాల సదానందం, కంచెర్ల విజేందర్, బయగాని జనార్ధన్ తదితరులు ఉన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకల మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 4.30 గంటలకు మంగళ వాయిద్యాలు, కాగడ హారతి, మంగళస్నానం, అభిషేకం, సాయి భజన కీర్తనలుంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, పల్లకి ఉత్సవం, శేజ హారతి కార్యక్రమాలుంటాయి.

హరితహారం అగ్గిపాలు

- ప్రతిఏటా దగ్ధమవుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల : పల్లెల్లో, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే హరితహారం. ఇప్పటి వరకు 8 విడతల్లో లక్షల మొక్కలను ప్రభుత్వం నాటగా, 9వ విడత హరితహార కార్యక్రమం జూన్ 19న రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం మండలం తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో సీఎం కేసీఆర్ మొక్కలు నాటి ప్రారంభించారు. ఇప్పటి వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8 విడతల్లో నాటిన మొక్కలు పూర్తిస్థాయిలో ఎక్కడా కనిపించకపోవడం విడ్డూరం. హరితహారం మొక్కల సంరక్షణకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో జీపీ, మున్సిపల్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి పెంచుతున్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ అగ్గిపాలు

ప్రధాన రోడ్లకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ప్రతీయేటా రైతుల చేతుల్లో దగ్ధమవుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న రైతులు పిచ్చిమొక్కలు చెత్తను తొలగించకుండా నేరుగా చెత్తకు నిప్పుపెట్టడంతో చెత్తతో పాటు, రోడ్లకు ఇరువైపులా ఉన్న అవెన్యూ, మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ పూర్తిగా దగ్ధం కావడంతో ప్రతీయేటా నాటిన చోటే నూతనంగా మొక్కలను నాటుతూ లెక్కల్లో చూపిస్తున్నారు. లెక్కల్లో ఉన్న మొక్కలు, భౌతికంగా ఉన్న మొక్కలకు వ్యత్యాసం చెప్పలేనంతగా ఉన్నా అధికారులు మొక్కుబడిగా హరితహారాన్ని కొనసాగిస్తున్నారు.

నిధులు దుర్వినియోగం

హరితహారంలో భాగంగా ప్రతీయేటా గ్రామ పంచాయతీకి కేటాయించిన నర్సరీల ద్వారా వేల సంఖ్యలో మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను మొక్కుబడిగా ప్రజలకు అందిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మరికొన్ని మొక్కలను ప్రైవేటు నర్సరీల నుంచి కొనుగోలు చేసి అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటుతున్నారు. నాటిన మొక్కల సంరక్షణలో అధికారులు పూర్తిగా విఫలం కావడంతో సుమారు 3 నుంచి నాలుగేళ్ల వయస్సు చెట్లు రైతుల చేతుల్లో అగ్నికి ఆహుతవుతున్నాయి.

అవగాహన కల్పించకనే..

అవెన్యూ ప్లాంటేషన్, మల్టీలేయర్‌లో ప్రధాన రోడ్ల వెంట నాటిన మొక్కల సంరక్షణలో అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో చెత్తతో పాటు, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను దర్జాగా తగలబెడుతున్నారు. అధికారులు స్పందించి హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రేగొండ మండలం రంగయ్యపల్లిలో దగ్ధమవుతున్న మొక్కలు

రైతులకు అవగాహన కల్పించాలి..



ప్రధానరోడ్ల వెంట ఉన్న రైతులకు మార్చి మాసం నుంచి మే వరకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తే అవెన్యూ ప్లాంటేషన్లను కొంత వరకైనా రక్షించవచ్చు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

\- బట్టల మొగిళి, గుమ్మడవెల్లి

మొక్కలను దహనం చేస్తే వారిదే బాధ్యత



ప్రధాన రోడ్డుకిరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను ఎవరైనా దహనం చేస్తే దానికి పూర్తి బాధ్యత వారిదే. దహనం చేసిన వారిచేతనే మళ్లీ మొక్కలను నాటిస్తాం. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులచే అవగాహన కల్పిస్తున్నాం.

\- అనిత, ఎంపీడీఓ టేకుమట్ల

అవినీతి నాయకుల నిలయమే బీఆర్ఎస్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం : అవినీతి, అక్రమాలకు పాల్పడిన నాయకులే ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతూ వారి నిలయంగా మార్చుకున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలంలోని ధన్వాడలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మంత్రిగా ఉన్న సమయంలో పక్కనే ఉంటూ ఆయనకు తెలియకుండా అక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల అవినీతికి పాల్పడిన నాయకులు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారన్నారు. ప్రస్తుతం వారి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆశయమైన ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీగా ఎన్నికై జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న జక్కు శ్రీహర్షిణి చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని సవాల్ విసిరారు.

బొడ్రాయి వద్ద పూజలు

మహదేవపూర్ : మహదేవపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి వద్ద పూజలు, మైసమ్మ ఊరు కొలుపు (గ్రామ కట్టడి) సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహంచారు. శనివారం సాయంత్రం మొదలైన ఊరు కొలుపు ఉత్సవాలు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి గ్రామస్తులందరూ మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామప్రధాన వీధుల్లో ఉత్సవ జెండాలను ఎగురవేశారు. అనంతరం బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. రాత్రి అంత మైసమ్మ కొలుపు(పెండ్లి)కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామం శుభిక్షంగా ఉండాలని ప్రకృతి దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి పాల్గొని మైసమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ దేవతల చల్లని చూపులతో పాడిపంటలు సంవృద్ధిగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు.

జనగర్జనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


ములుగు: జెండా ఊపి ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి


వెంకటాపురం (కె) : తరలివెళ్తున్న నాయకులు


ఎస్ఎస్‌తాడ్వాయిలో..


ఏటూరునాగారంలో..

ములుగు/ములుగు రూరల్: ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జనగర్జనకు ములుగు, గోవిందరావుపేట మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, జనగర్జన సభ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ రఘువీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. తరలిన వారిలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ములుగు, గోవిందరావుపేట మండలాల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, పాలడుగుల వెంకటక్రిష్ణ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

వెంకటాపురం(కె): వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తరలిన వారిలో వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీ గార్లపాటి రవి, నాయకులు చిడెం సాంబశివరావు, మన్నెం సునీల్, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు అరెం లచ్చు పటేల్, సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న , సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, జగన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, చక్రపాణి, వెంకటేశ్వర్లు, సాయిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రవికుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం : మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద ఎత్తున ఖమ్మం జనగర్జన సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ములుగు అసెంబ్లీ ఇన్‌చార్జ్ వెంకన్న మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీదే అన్నారు. తరలిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, ఖలీల్, దేవేందర్, నర్సింగరావు, లాలయ్య, ఎల్లయ్య, బాలరాజు, గౌస్, విజయ్, మధు, రాంగోపాల్, నవీన్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చిట్యాల: ఖమ్మం జనగర్జన సభకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి గద్దం కొంరయ్య, ఓబీసీ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, లక్ష్మన్, చిలుకల రాయకొంరు, క్యాతం మార్కండేయ, చిలుముల రాజమొగిలి, బైరం రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు


బోడులో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని జూకల్‌లో మల్లన్న బోడుకు వెలసిన పర్వతాల మల్లికార్జునస్వామికి వరదపాశ మహోత్సవం సందర్భంగా ఆదివారం గొల్లకురుములు, గ్రామస్తులు వర్షాలు కురవాలని ఒగ్గు కళాకారుల బృందం చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల నుంచి వర్షాలు లేక పోవడంతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలోని మల్లన్నస్వామి వద్దకు వెళ్లి వర్షాలు కురవాలని అలాగే పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ప్రజలందరు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఉప సర్పంచ్ చాడ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ జంబుల తిరుపతి, గ్రామస్తులు దొంతి రాంరెడ్డి, సూర రమేష్, నూనే రవీందర్ , కుసుంబ రాజేశ్వర్‌రావు, రేపూరి నర్సింహారెడ్డి, చాడ జితేందర్‌రెడ్డి ఒగ్గు కళాకారుల బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘు నాయకులు

కాటారం: మండల పంచాయతీ కార్మికుల సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పప్పుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బుర్రకుంట రవి, ఉపాధ్యక్షుడిగా బోడ రాజయ్య, కోశాధికారి ఆత్కూరి రవి, సహాయ కార్యదర్శిగా కాల్వ రమేశ్, కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వరి, బ్రహ్మం, దుర్గం రమేశ్, గౌరమ్మ, కమల, ఎల్లారి, మోసిన్‌బేగ్, స్వామి, శ్రీను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రమేశ్, మండల ముఖ్యసలహాదారులు దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, ఇనుగాల కొండయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మొగుళ్లపల్లి : ఒకే వేదికపై ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొగుళ్లపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 2003–04 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గతంలో జరిగిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన వారిని సుదర్శన్, శ్రీలత, శ్రీమతి, ఓదెలు, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, చక్రధర్, రాజేందర్, ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటె ధర్మారావు, ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటిసి జోరుక సదయ్య, ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పున్నంచందర్‌రావు, పూర్వ విద్యార్థులు దానవేని రాములు, విజేందర్, చెక్క శంకర్, మధు, నాగార్జున, రాజు, చొక్కారెడ్డి, స్వప్న, శ్రావణి, శ్వేత, శ్రీదేవి, మమత, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1998–1999 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు భిక్షపతి, నరేష్, శోభన్, రాజు, పాల్గొన్నారు.